

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | శనివారం | 26-09-2026 | సంపుటి: 3 | సంచిక: 233 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 26-09-2026 | VOLUME : 3 | ISSUE : 233 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575


# గంగమ్మను చేరిన మహా గణపతి



- మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం పూర్తి
- భారీగా తరలివచ్చిన భక్తులు
- భారీ భద్రత నడుమ ప్రశాంతంగా సాగిన ఉత్సవం
- జై గణేశ నినాదాలతో మార్మోగిన ట్యాంక్‌బండ్ 2

బాలాపూర్ లడ్డూ 39 లక్షలు 3

# ఐలమ్మ పోరాటం తెలంగాణకు స్ఫూర్తి



- భూమి, భుక్తి, హక్కుల కోసం సాగించిన పోరాటం చిరస్మరణీయమన్న సీఎం రేవంత్‌రెడ్డి
- సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీక
- బీసీలు, పేదలు, మహిళల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం
- సమాన అవకాశాలు, గౌరవం కల్పించడమే ఐలమ్మకు నిజమైన నివాళి

2

## మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ నేడు

- గచ్చిబౌలి విప్రో సర్కిల్‌లో కాంస్య విగ్రహం ఏర్పాటు
- జయంతి సందర్భంగా ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- తెలంగాణ ఏర్పాటులో ఆయన పాత్ర చారిత్రాత్మకమన్న పొన్నం

2



2

## సీఎం రేవంత్ కు మహమ్మద్ అవార్డు ప్రదానం



2

## విచారణకు హాజరు కండి

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి ఈడీ సమన్లు
- సాహితి ఇన్‌ఫ్రాటెక్ మనీ లాండరింగ్ కేసులో..

# మోటార్లు నడిపి జలాశయాలు నింపాలి



- నీళ్లు లేక సిద్దిపేటలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నడవని పరిస్థితి
- గోదావరిలో వరద పోతుంటే బురద రాజకీయాలా?
- రైతుల ఆవేదన కనిపించడం లేదా
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 25: ఒకవైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు గోదావరిలో భారీ వరద ప్రవాహం ఉన్నా, ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో మీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగిస్తోందంటూ మాజీ మంత్రి హరీశ్రావు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే మీరు మాత్రం ప్రాజెక్టుల మీద రాజకీయాలు చేస్తూ, గోదావరి జలాలను లిఫ్ట్ చేయకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు ఒకవైపు గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుంటే,

మిగతా 3వ పేజీలో..

# బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇయ్యలే



- కాంగ్రెస్ వచ్చాక 16.32 లక్షల రేషన్ కార్డులు మంజూరు
- రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డులు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- 27, 28 లలో హుజూర్‌నగర్, మిర్యాలగూడ, సూర్యాపేటలో మంత్రి పర్యటన

2



# గురుకుల విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- 14 మందికి గాయాలు.. ఆలస్యంగా వెలుగులోకి
- హాస్టల్ కు చేరుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి
- లోపలికి వెళ్ళకుండా అడ్డుకున్న పోలీసులు, సిబ్బంది
- హాస్టల్ ఎదుట ధర్నాకు దిగిన దయాకర్ రావు

పాలకుర్తి, సెప్టెంబర్ 25 : జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రం లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి నిద్రిస్తున్న విద్యార్థినులను ఎలుకలు కరవడంతో పలువురికి గాయాలయ్యాయి. బాధితులను ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించినట్లు

మిగతా 2వ పేజీలో..

## రాహుల్ వైద్య పరీక్షలు చేయించుకోవాలి



- ప్రధాని, హోంమంత్రిపై వ్యాఖ్యలు దురదృష్టకరం
- ఫిరాయింపులు ప్రోత్సహిస్తూ ఓట్ చోరీ అనడం ద్వంద్వ వైఖరి
- రాజ్యాంగబద్ధ సంస్థలు, బలగాలపై నమ్మకం లేకపోవడం సిగ్గుచేటు
- రాహుల్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం

3



# అక్టోబర్ 25 నుంచి 'హ్యామ్' రహదారుల పనులు

- గ్రామీణ తెలంగాణకు శాశ్వత మౌలిక వసతులే లక్ష్యం
- తొలి విడత రూ.6 వేల కోట్లతో 7,448 కి.మీ మేర రోడ్లు
- ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికి తొలి ప్రాధాన్యం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

3



## పెన్షన్‌కు లంచం డిమాండ్

- ఎస్సీ అభివృద్ధి శాఖ సిబ్బంది ముగ్గురు సస్పెన్షన్
- బాధితురాలి ఫిర్యాదుతో విచారణ జరిపించిన కలెక్టర్ పవార్

2

## జ్ఞానేష్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలు

4

- బీహార్‌లో కార్యకర్తలపై వాటర్ కెనాన్ల ప్రయోగం
- అస్సాంలో గౌరవ్ గొగోయ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పాట్నాలో కాంగ్రెస్ కార్యకర్తలపై వాటర్ కెనాన్ల ప్రయోగం



# సీఎం రేవంత్ కు ముహమ్మద్ అవార్డు ప్రదానం

**తిరువనంతపురం, సెప్టెంబర్ 25:**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్2026' అవార్డును స్వీకరించారు. కేరళం రాష్ట్రంలోని నిలంబూర్‌లో ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆర్యదాన్ ముహమ్మద్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు కేరళ వెలుపల నుంచి ఎంపికైన తొలి వ్యక్తిని కావడం మరింత గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. "నేను కేరళం వచ్చిన ప్రతిసారీ ఎంతో ఆత్మీయ స్వాగతం లభించింది. రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగిన భారత్ జోడో యాత్ర కోసం ఇక్కడికి వచ్చాను. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఇక్కడికి వచ్చాను. కేరళం నాకు ఎంతో ఆత్మీయమైనది. కేరళం ప్రజలు లౌకికవాదానికి కట్టుబడి ఉన్నందుకు కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ ఒక గొప్ప రాజకీయ నాయకుడు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారు. పలువురు ముఖ్యమంత్రుల వద్ద నాలుగుసార్లు మంత్రిగా పనిచేశారు. కేరళం రాజకీయాల్లో ఆయన ఒక చాణక్యుడిలా ఉండేవారు అని అన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ నిలంబూర్‌లోనూ, కేరళంలోనూ కాంగ్రెస్ పార్టీకి ఒక మహావృక్షంలా ఉండేవారని గుర్తుచేశారు. ఆయన తన జీవితమంతా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడారని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆర్యదాన్ స్ఫూర్తితో మనమంతా కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ చైర్మన్ ఆర్యదాన్ షౌకత్, కేరళం మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పెన్షన్‌కు లంచం డిమాండ్

**సూర్యాపేట, సెప్టెంబర్ 25:**

పదవీ విరమణ పొందిన తోటి ఉద్యోగిణి పింఛను ప్రతిపాదనలు పంపడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు లంచం డిమాండ్ చేసిన ముగ్గురు ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కొరడా ఝుళిపించారు. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌లను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అనంతరం ఈ చర్యలు తీసుకున్నారు.షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) అభివృద్ధి శాఖలో విధులు నిర్వర్తించిన ఓ ఉద్యోగి గత మార్చి లో పదవీ విరమణ పొందారు. అయితే ఆమెకు రావాల్సిన పింఛను, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తాలూకు ఫైలును (పెన్షన్ ప్రపోజల్) ఎప్పటికప్పుడు పై కార్యాలయానికి పంపించాల్సి ఉండగా గతంలో పనిచేసిన అధికారిణితో పాటు సంబంధిత విభాగ ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించారు. ఆ శాఖకు చెందిన గతంలో పనిచేసిన సీనియర్ అధికారిణితోపాటు సీనియర్ అసిస్టెంట్ జి.రవివర్మ, జూనియర్ అసిస్టెంట్ బి.యాదగిరి, అటెండర్ బి.రాము బాధితురాలి నుంచి పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేశారు.

అడిగిన మొత్తం ఇస్తేనే ఫైలుపై సంతకాలు చేసి ముందుకు పంపుతామని చెప్పడంతో ఆ మొత్తం ఇచ్చేందుకు బాధితురాలు నిరాకరించడంతో నెలలతరబడి ఫైల్ కదలకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వీసు ముగిసి నెలలు గడుస్తున్నా లంచం ఇవ్వలేదనే సాకుతో తన పెన్షన్ ఫైలును కదలకుండా అడ్డుకుంటున్నారని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

**బాధితురాలి ఆవేదనపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్**

ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఉన్నతాధికారులు జరిపిన విచారణలో ఉద్యోగులు లంచం డిమాండ్ చేసిన మాట వాస్తవమేనని, విధుల్లో తీవ్ర అలసత్వం, బాధ్యతారాహిత్యం ప్రదర్శించారని తెల్చారు. విచారణ నివేదిక ఆధారంగా సీనియర్ అసిస్టెంట్ రవివర్మ, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి, అటెండర్ రాములను తక్షణమే సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు వెలువరించారు. దింతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అధికారిణి పై సైతం సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించినా, ప్రజలను లేదా విశ్రాంత ఉద్యోగులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ లంచాల కోసం వేధించినా ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

# గంగమ్మను చేరిన మహా గణపతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 :**

ఖైరతాబాద్‌లో కొలువై నవరాత్రులు పూజలందుకున్న పంచముఖ సంకట హర మహా గణపతి శుక్రవారం మధ్యాహ్నం భక్తుల కోలాహలం నడుమ, జై గణేశ నినాదాల మధ్య గంగమ్మ ఒడికి చేరుకున్నారు. ప్రధాన నిమజ్జన ఘట్టం ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా ముగియడం పట్ల భక్తులతోపాటు పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. వరుణుడు కూడా కరుణించాడు. ట్యాంక్‌బండ్‌పై క్రేన్ నంబర్4 దగ్గర గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నిమజ్జనం పూర్తి చేశారు. మహా గణపతి నిమజ్జనాన్ని వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

ఉదయం 9.30 గంటల సమయంలో ఖైరతాబాద్ నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా శోభాయాత్ర కొనసాగింది. మధ్యాహ్నం 2.15 గంటలకు హుస్సేన్‌సాగర్‌లో భారీ క్రేన్ల సాయంతో నిమజ్జన ప్రక్రియను పూర్తి చేశారు. సెక్రటేరియట్ సౌత్ ఈస్ట్ మార్గంలో భక్తులు కిక్కిరిసిపోయారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, అప్పర్ ట్యాంక్ బండ్‌పై అత్యంత కోలాహలంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు కొనసాగుతున్నాయి. జంట నగరాల నుంచి భారీగా విగ్రహాలు తరలివస్తున్నాయి. 12 క్రేన్ల ద్వారా నిమజ్జనం ప్రక్రియ కొనసాగుతోంది. భద్రత కోసం పోలీస్ కంట్రోల్ రూం ద్వారా 58 సీసీటీవీ కెమెరాలతో పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి అయ్యేలా అప్పర్ ట్యాంక్ బండ్‌పై భారీగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రతి క్రేన్ వద్ద ఒక ఎసఐ, ఐదుగురు పోలీస్ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో రంగంలోకి 25 క్రైమ్ టీమ్స్, 10 షీ టీమ్స్ బృందాలు విధులు నిర్వర్తిస్తున్నాయి



# ఐలమ్మ పోరాటం తెలంగాణకు స్ఫూర్తి



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:**

అణచివేత, దోపిడీని ఎదిరించి భూమి, భుక్తి, హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బలహీనవర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన ఘనంగా నివాళులర్పించారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన బాట నేటి తరాలకు ఆదర్శమని కొనియాడారు.

**దొరలపై పోరుకు జంగ్ సైరన్**

దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వాన్ని సవాల్ చేస్తూ ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని సీఎం గుర్తుచేశారు. సమ్మక్కసారలమ్మ, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించినట్లు తెలిపారు. కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు పెట్టి ఆమె సేవలను స్మరించుకున్నామని చెప్పారు.

**బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యం**

ఐలమ్మ స్ఫూర్తితో బీసీలు, పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు గురుకులాలు, హాస్టళ్లలో వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామన్నారు. యువత, మహిళల ఆర్థిక సాధికారతపైనా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. సమాజంలోని ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు, గౌరవం, న్యాయం అందించడమే చాకలి ఐలమ్మకు ఇచ్చే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.

# మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ నేడు

- గచ్చిబౌలి విప్రో సర్కిల్‌లో కాంస్య విగ్రహం ఏర్పాటు
- జయంతి సందర్భంగా ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- దేశ ఆర్థిక ప్రగతికి మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయమని వ్యాఖ్య
- తెలంగాణ ఏర్పాటులో ఆయన పాత్ర చారిత్రాత్మకమన్న పొన్నం

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:**

మాజీ ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతిని పురస్కరించుకుని గచ్చిబౌలి విప్రో సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేశ నిర్మాణం, ఆర్థిక ప్రగతితోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆర్థిక సంస్కరణలతో కొత్త దిశ 1991లో కేంద్ర ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు నాంది పలికాయని పొన్నం గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా దేశ అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం, ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేశారన్నారు. ఆయన హయాంలో ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం వంటి కీలక నిర్ణయాలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని పొన్నం పేర్కొన్నారు. 2009లో రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు వరకు ఆయన నాయకత్వం కీలకమైందన్నారు. ఎంపీగా ఉన్న సమయంలో మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో పనిచేసే అవకాశం తనకు లభించిందని, ఆయన సహకారంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలిగానని పొన్నం తెలిపారు.



# బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇయ్యాలే

**సూర్యాపేట, సెప్టెంబర్ 25:**

పదేళ్లపాటు అధికారంలో ఉన్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయకుండా పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేసిందని నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఆరోపించారు. కొత్త కుటుంబాలు ఏర్పడినా, కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినా, అర్హులు దరఖాస్తు చేసుకున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం ఆహార భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. 2025 జనవరి 1 నాటికి రాష్ట్రంలో 89,95,282 రేషన్ కార్డులు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 16,32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని చెప్పారు. వీటి ద్వారా మరో 61,09,544 మందికి ఆహార భద్రత కల్పించామన్నారు. పాత, కొత్త కార్డులు కలిపి ప్రస్తుతం రాష్ట్రంలో 1,06,28,092 ఉండగా 3,42,57,109 మంది ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికీ రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రేషన్ కార్డు బియ్యం పొందే పత్రం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు ఆహార భద్రతతోపాటు వివిధ సంక్షేమ పథకాలకు కీలక ఆధారమని పేర్కొన్నారు. రేషన్ కార్డుదారులందరికీ ప్రతి వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కాగా, తన సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌తోపాటు మిర్యాలగూడ నియోజకవర్గంలో మంత్రి రెండు రోజులు పర్యటించనున్నారు. నేరేడుచర్లలో పాలకీడు, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు మంత్రి ఉత్తమ్ రేషన్ కార్డులు సోమవారం పంపిణీ చేస్తారు. అనంతరం ముసిఒడ్డు సింగారంరోళ్లవారిగూడెం బీటీ రోడ్డును ప్రారంభిస్తారు. హుజూర్‌నగర్‌లో రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయనున్నారు. మేళ్లచెరువు మండలం కందిబండలో రూ.2.80 కోట్లతో నిర్మించిన వంతెన, కప్పలకుంట తండా, వెల్లటూరు ఆర్‌అండ్ఆర్ కాలనీ, వేపల మాధవరం గ్రామాల్లో నిర్మించిన వివిధ భవనాలను ప్రారంభిస్తారు. మేళ్లచెరువులో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువపై రూ.3 కోట్లతో నిర్మించిన మూడు వంతెనలను ప్రారంభించి మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు. 28న గరిడేపల్లి మండలం కొండాయిగూడెం, రెగ్యులగడ్డ తండాల్లో నిర్మించిన మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలో రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు. ఈ రెండు రోజుల పర్యటనలో మొత్తం రూ.8.90 కోట్ల విలువైన రహదారులు, వంతెనలు, గ్రామ పంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్, స్వయం సహాయక సంఘాల భవనాలను మంత్రి ప్రారంభించనున్నారు.

మిర్యాలగూడ కార్యక్రమం అనంతరం మంత్రి సూర్యాపేటకు చేరుకుని భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహార శైలికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొంటారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉండాలంటే ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజల ఓటు హక్కును, ఎన్నికల ప్రక్రియ పవిత్రతను కాపాడటం ప్రతి ప్రజాస్వామ్యవాది బాధ్యత అని పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.



# విచారణకు హాజరు కండి

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 :**

సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో విచారణ నిమిత్తం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం సమన్లు జారీ చేసింది. కంపెనీకి చెందిన సుమారు రూ.2.1 కోట్ల నిధులు ఆయన బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించినట్లు గుర్తించడమే ఇందుకు కారణం. సోమవారం తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆయనను ఆదేశించింది. ఈ లావాదేవీల గురించి ఆయన్ని ప్రశ్నించడంతో పాటు కంపెనీ నుంచి అందిన డబ్బుకు సంబంధించి వివరణ కోరే అవకాశం ఉంది. ఇళ్ల కొనుగోలుదారుల నుంచి సాహితీ ఇన్‌ఫ్రా సేకరించిన నిధులను దారి మళ్లించారన్న ఆరోపణలపై ఈడీ చేపట్టిన విస్తృత దర్యాప్తులో భాగంగా ఈ సమన్లు జారీ అయ్యాయి. కొనుగోలుదారుల ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కంపెనీ, దాని మేనేజింగ్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణ ఇతరులపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ మనీ లాండరింగ్ దర్యాప్తును చేపట్టింది. లక్ష్మీనారాయణను 2024లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఫ్రీ లాంచ్ పేరుతో కొనుగోలుదారుల నుంచి నగదు వసూలు చేసినట్లు, ఈ నిధులను కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించినట్లు గాంధీపై ఆరోపణలు ఉన్నాయి. గతంలో రూ.161 కోట్ల విలువైన ఆస్తులను, మరో విడతలో రూ.12.6 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఇప్పటివరకు 56 బ్యాంకు ఖాతాలను అధికారులు సీజ్ చేశారు.

# గురుకుల విద్యార్థినులను కరిచిన ఎలుకలు

**మొదటిపేజీ తరువాయి**

సమాచారం. ఈ ఘటనపై స్పందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం గురుకుల పాఠశాల, హాస్టల్ కు చేరుకున్నారు. విద్యార్థినులను పరామర్శించి ఘటనకు గల కారణాలను తెలుసుకునేందుకు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు, పాఠశాల సిబ్బంది అను మతించలేదని ఆయన తెలిపాయ. విద్యార్థినుల పరిస్థితి గురించి తెలుసుకునే వరకు అక్కడి నుంచి వెళ్లేది లేదంటూ హాస్టల్ ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం వార్డెన్, ప్రిన్సిపాల్ తో మాట్లాడిన ఎర్రబెల్లి విద్యార్థినులకు కనీస వసతులు కల్పించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయ ని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య సమస్యలు ఉన్నాయని, గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని పాము కరిచిందని ఆయన పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత, కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్ల క్ష్యం చేస్తోందని ఆరోపించారు. 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటనపై ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకర మన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ పాఠశాలల సెక్రటరీ శారదతో ఫోన్లో మాట్లాడి ఘటన వివరా లను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు ఎర్రబెల్లి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చినట్లు చెప్పారు. కనీస వసతుల కల్పన పై ప్రభుత్వం దృష్టి సారించాలని, విద్యార్థి నుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు. గతంలో తాను మంత్రిగా ఉన్నపుడు విద్యార్థుల సౌకర్యాల పై పర్యవేక్షించామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

**బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా**

ఎలుకల దాడిలో విద్యార్థినులు గాయపడడంతో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో పాఠశాల గేటు ముందు ధర్నా నిర్వహించారు. విద్యార్థినీలకు మెరుగైన వైద్య సేవలు అందించలన్నారు. పాఠశాలలో పరిశుభ్రతను పాటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు పాకనాటి దేవేందర్ రెడ్డి, దొంగరి మ హేందర్, మండల అధ్యక్షులు మారం రవికుమార్, ప్రధాన కార్యదర్శులు వేల్పుల దేవరాజు, పెనుగొండ సోమేశ్వర్, నాయకులు ఈర్ల రాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

**తహసిల్దార్, ఎంపీడీవోలకు బీఆర్ఎస్ వినతి పత్రం**

పాఠశాలలో జరిగిన సంఘటనను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా ఇన్చార్జి అనంతుల ఆంజనేయులు ఆధ్వర్యంలో తహసిల్దార్, ఎంపీడీవోలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల నిర్వహణలో గత పాలకుల తరహాలోనే నేటి పాలకులు అవలంబిస్తున్నారని విమర్శించారు. బాలికలకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి తల్లిదండ్రులకు చూపాలని డిమాం డ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మూల ప్రభాకర్ గౌడ్, పొన్నం యాకయ్య గౌడ్, నాయకులు అంబోజు సంతోష్, అనిత, పూలమ్మ, కొమురయ్య, సోమ నరసయ్య పాల్గొన్నారు.

**ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..**

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటన నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థినీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎడవల్లి సోమచ్ అండ్, రాష్ట్ర నాయకులు చెరిపెల్లి యాదగిరి స్వామి, నాయకులు దండు రామచంద్రు. జలగం నరేష్, గడ్డం బాబు. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 25 నుంచి 'హ్యామ్' రహదారుల పనులు

**హనుమకొండ, సెప్టెంబర్ 25:**



గ్రామీణ తెలంగాణకు మెరుగైన, నాణ్యమైన రహదారి సౌకర్యాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా హ్యామ్ విధానంలో చేపట్టనున్న రహదారుల నిర్మాణ పనులను అక్టోబర్ 25 నుంచి ప్రారంభించాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ప్రాంతీయ అధికారులతోపాటు కాంట్రాక్టర్లతో మంత్రి శుక్రవారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. హ్యామ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో మొత్తం 18,472 కి.మీ మేర గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. తొలి విడతలో మూడు వేల గ్రామ పంచాయతీల పరిధిలో రూ.6 వేల కోట్లకు పైగా వ్యయంతో 7,448 కి.మీ (2,145 రహదారులు) మేర పనులు చేపట్టనున్నామన్నారు. వీటిని 17 సర్కిళ్లు, 17 ప్యాకేజీలుగా విభజించినట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో రూ. 1,130 కోట్లతో 1,366 కి.మీ మేర 445 రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఉన్న రోడ్ల అభివృద్ధితోపాటు 10 శాతం కొత్త రహదారులను నిర్మిస్తామన్నారు.

**15 ఏళ్లపాటు నాణ్యతకు బాధ్యత**

హ్యామ్ విధానం ద్వారా రహదారుల నాణ్యతకు, నిర్వహణకు పెద్ద పీట వేస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ప్రాజెక్టు పూర్తయిన వెంటనే 40 శాతం నిధులు చెల్లించి మిగిలిన 60 శాతం నిధులను 15 ఏళ్ల పాటు విడతల వారీగా చెల్లిస్తామన్నారు. దీనివల్ల 15 ఏళ్ల పాటు రోడ్ల నిర్వహణ, నాణ్యత బాధ్యత పూర్తిగా కాంట్రాక్టర్లదే ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. అగ్రిమెంట్లు, సాంకేతిక ప్రక్రియ పూర్తయినందున అక్టోబర్ 25న కచ్చితంగా పనులు ప్రారంభం కావాలని దిశానిర్దేశం చేశారు.

**తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు**

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. రిజర్వాయర్లలోని నీటిని తాగునీటికే ప్రాధాన్యతనిస్తూ వాడుతున్నామని, మిషన్ భగీరథ పరిధిలోని 86 సమస్యాత్మక జనావాసాల్లో యుద్ధప్రాతిపదికన నీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో నీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ పనిచేస్తోందని తెలిపారు.

**జలసిరి.. మహిళా సాధికారత**

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు 'ప్రతి ఇంటికి ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊటకుంట' లక్ష్యంగా జలసిరి కార్యక్రమం అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ఇప్పటికే రూ. 2 వేల కోట్ల వేతనాలు చెల్లించామని, అక్టోబర్ 2న జరిగే గ్రామ సభల్లో వచ్చే ఏడాది అభివృద్ధి ప్రణాళికలను ఆమోదించాలని అధికారులకు సూచించారు. మరోవైపు మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, స్వయం సహాయక సంఘాలకు రూ. 67 వేల కోట్ల రుణాలు అందించి 6 లక్షల మంది మహిళలు వ్యాపారాలు పెట్టుకునేలా ప్రోత్సహించామన్నారు. ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరుపైనే ఇస్తూ వారి ఆత్మగౌరవాన్ని పెంచుతున్నామని ఆమె ఉద్ఘాటించారు.

గ్రామ ఆస్తులు, అవసరాలను తెలిపే చిత్రపటాన్ని ప్రతి గ్రామంలో వేసి అవసరాలను గుర్తించాలన్నారు. హనుమకొండ కలెక్టరేట్లో వేసిన చింత నెక్కొండ గ్రామ పటాన్ని మంత్రి సీతక్క పరిశీలించారు. అవసరమైన నిధులు మంజూరు చేస్తాం.. గ్రామ అవసరాలను తీర్చే విధంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల స్పెషల్ సీఎస్ దాన కిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ సత్య శారద, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, ఈఎన్సీలు కృపాకర్ రెడ్డి, జగదీశ్వర్, కాంట్రాక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**జబ్బుతో బాధపడుతున్న బాలికను కలిసిన మంత్రి**

సమావేశం అనంతరం అరుదైన జబ్బుతో బాధపడుతున్న హనుమకొండ రెడ్డి కాలనీకి చెందిన రిషితను మంత్రి సీతక్క ఆమె ఇంటికి వెళ్లి కలుసుకున్నారు. తనను కలుసుకోవాలన్న రిషిత కోరికను నెరవేర్చిన మంత్రి సీతక్క బాలిక బాగోగులు తెలుసుకున్నారు.

# మోటార్లు నడిపి జలాశయాలు నింపాలి

**మొదటిపేజీ తరువాయి**

మరోవైపు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉన్నాయి. మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 13 టీఎంసీలు మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. ఇక్కడ 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం అందుబాటులో ఉంది. మల్లన్న సాగర్ నిండుకుండలా మారితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతోపాటు మీరు చెబుతున్న మూసీ ప్రాజెక్టుకు కూడా ఇక్కడి నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుంది. కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లోనూ 15 టీఎంసీలకు కేవలం 6 టీఎంసీలే ఉన్నాయి. ఇక్కడికి సైతం నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఎల్లంపల్లిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభిస్తే మిడ్ మానేరు సహా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా పూర్తి పరిష్కారం లభిస్తుంది. ఈ రిజర్వాయర్లను నింపడం వల్ల దాదాపు 5 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి దోహదం చేసినట్లవుతుందన్నారు. మరోవైపు మిడ్ మానేరు దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యాం (ఎల్ఎండి)లో ప్రస్తుతం 11 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడికి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లోని రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేసిన వారవుతారు.

సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ కోసం రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడం జరిగింది. అయితే రంగనాయక సాగర్‌లో నీళ్లు లేకపోవడం వల్ల ఫ్యాక్టరీ నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితితో పామ్ ఆయిల్ సాగు చేస్తున్న రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి కోసం రైతులు కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తుంటే మీరు మాత్రం నదుల్లో వస్తున్న నీళ్లను లిఫ్ట్ చేయకుండా కిందకు వదిలిపెడుతున్నారు అని విమర్శించారు. ప్రస్తుతం గోదావరిలో ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్నది. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకొని అన్ని మోటార్లను నడిపి నీళ్ళు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా మీరు చేస్తున్న నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతున్నది. జలకళతో కనిపించాల్సిన రిజర్వాయర్లు ఎండిపోయి కనిపిస్తున్నాయంటే దానికి కారణం నీటి నిర్వహణలో మీ ప్రభుత్వ వైఫల్యం. ఇప్పటికైనా కళ్ళు తెరవండి.. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదు.. ఎల్‌నినోను సాకుగా చూపకుండా అందివచ్చిన గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా ఆన్‌ఆఫ్ పద్ధతిలో కాక 24 గంటల పాటు అన్ని మోటార్లు నడిపి జలాశయాలను నింపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి రైతు ప్రయోజనాల కోసం ఆలోచించాలని, ప్రకృతిపై నెపం నెట్టి రైతులకు సాగు నీళ్లు ఇచ్చే బాధ్యత నుంచి తప్పించుకోవద్దని హరీష్‌రావు హితవు పలికారు.

# భద్రాద్రి వద్ద పెరుగుతున్న వరద

- **నిండుకుండలా తాలిపేరు ప్రాజెక్ట్**
- **పది గేట్లు ఎత్తి 55. 437 క్యూసెక్కుల నీరు విడుదల**

**భద్రాచలం, సెప్టెంబర్ 25:**

అల్ప పీడన కారణంగా రాష్ట్రవ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీని కారణంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం. వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతున్నది. శుక్రవారం మధ్యాహ్నానికి 18. 2 అడుగుల ఉన్న గోదావరి నీటిమట్టం సాయంత్రానికి 20, 1 అడుగుకు చేరుకుంది. ఎగువ ప్రాంతాలలో ఉన్న ప్రాజెక్టులు నుండి నీరు విడుదల చేయడంతో ఇది క్రమంగా పెరుగుతూ శనివారం ఉదయం నుంచి మరింత పెరిగి 25 అడుగుల నుండి 30 అడుగుల వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే చర్ల మండలంలో ఉన్న తాళపేరు ప్రాజెక్ట్ నిండు కుండలా మారడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పదిహేను ఎత్తివేశారు. 55. 437 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. అలాగే చత్తీస్ గఢ్, ఒడిశా, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుకుంటున్నది. దీని కారణంగా భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతున్నది. మేడిగడ్డ ప్రాజెక్టు నుండి 85 గేట్లు ఎత్తివేసి 41, 520 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టులు వరద నీరు ప్రమాద స్థాయికి చేరుకోవడంతో కింది భాగానికి నీటిని విడుదల చేస్తున్నారు. దీని కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతున్నది.



**అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్**

భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమ క్రమంగా పెరుగుతున్న దృశ్య అధికారులను జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను అప్రమత్తం చేశారు. ప్రమాద పరిస్థితిని ముందుగానే గమనించాలని అవసరమైతే లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే భారీ వర్షాల కారణంగా ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్ల వద్దని కోరారు.

# రాష్ట్రంలో 200 కొత్త జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- **హనుమకొండకు 7 కోర్టులు.. వరంగల్‌కు 5 మంజూరు**

**హనుమకొండ, సెప్టెంబర్ 25 :**

తెలంగాణలో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా న్యాయవ్యవస్థ పరిధిలో 200 కొత్త అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జికమ్‌అడిషనల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయశాఖ జీవో ఎంఎస్ నెం.59, తేదీ 24092026ను జారీ చేసింది.

తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) రాష్ట్రంలో 594 కొత్త కోర్టుల ఏర్పాటుకు అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు, పునరావృత-పునరావృతేతర వ్యయాలకు బడ్జెట్‌తో సహా అనుమతి కోరగా, ప్రభుత్వం పరిశీలన అనంతరం తొలి విడతలో 200 కోర్టులకు అనుమతి ఇచ్చింది. అవసరమైన సిబ్బంది, ఇతర వ్యయాలకు సంబంధించి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు జీవోలో పేర్కొంది. తదుపరి చర్యలు చేపట్టాలని హైకోర్టు రిజిస్ట్రార్‌ను ప్రభుత్వం కోరింది.

ఉమ్మడి వరంగల్ ప్రాంతానికి కూడా ప్రాధాన్యం లభించింది. జీవోకు జతచేసిన జాబితా ప్రకారం హనుమకొండ జిల్లా పరిధిలో హనుమకొండలో 6, పరకాలలో ఒకటి కలిపి మొత్తం 7 కొత్త కోర్టులు మంజూరయ్యాయి. వరంగల్ జిల్లా పరిధిలో వరంగల్ ఎట్ హనుమకొండలో 4, నర్సంపేటలో ఒకటి కలిపి మొత్తం 5 కోర్టులు ఏర్పాటు కానున్నాయి. అదేవిధంగా జనగామలో 2, స్టేషన్ ఘన్‌పూర్‌లో ఒకటి; జయశంకర్ భూపాలపల్లిలో 2; ములుగులో ఒక కొత్త కోర్టును ప్రతిపాదిత జాబితాలో పొందుపరిచారు.



రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 200 కోర్టుల కేటాయింపును అనుబంధ జాబితాలో ప్రభుత్వం ఖరారు చేసింది. కొత్త కోర్టుల ఏర్పాటు ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారానికి అదనపు న్యాయస్థానాల సామర్థ్యం అందుబాటులోకి రానుంది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని జీవోలో పేర్కొన్నారు.



# బాలాపూర్ లడ్డూ @రూ.39 లక్షలు

**మహేశ్వరం, ప్రజాతంత్ర సెప్టెంబర్ 25:**

ప్రపంచ ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణపతి లడ్డు వేలం పాటకు జిహెచ్ఎంసి బడంగ్ పేట్ సర్కిల్ బాలాపూర్ గ్రామం బొడ్డురాయి వేదికయ్యింది. శుక్రవారం ఉదయం ఐదు గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భజనలు చేస్తూ.. స్వామి వారి పాటలు పాడుతూ.. ఊరు చుట్టూ ఊరేగింపు నిర్వహించి, గ్రామ బొడ్రాయి వద్దకు గణనాథుని తీసుకువచ్చారు. అనివార్య కారణాలవల్ల ఊరేగింపుకు కొంత ఆలస్యం జరగడంతో, లడ్డు వేలం పాట దాదాపు రెండు గంటలకు పైగా ఆలస్యం అయింది. భక్తులు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న బాలాపూర్ గణేష్ లడ్డు వేలం పాటను వేలాది మంది భక్త జన సందోహం నడుమ ఉత్సవ కమిటీ సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. లడ్డు వేలం పాటలో సాహెబ్ నగర్ కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి, చంపాపేట్కు చెందిన మర్రి రవికిరణ్ రెడ్డి, చంపా పేట్కు చెందిన కెవిఆర్ ఫ్లవర్ మర్చంట్ కందాడ శాలిని వీరేందర్ రెడ్డి, హస్తినా పురంకు చెందిన కంచర్ల శివారెడ్డి, లండన్ నుంచి సుశి ఆండ్ కో నుంచి సామ దయానంద్ రెడ్డి, సామ వరానంద్ రెడ్డి, హస్తినా పురంకు చెందిన జిఎర్ఆర్ డెవెలపర్స్ నుంచి గడ్డం నవీన్ రెడ్డి, బాలాపూర్ నుంచి ఇబ్రాం ప్రత్యూష్, బాలాపూర్ కు చెందిన రితున్ రెడ్డితో కలిపి 9 మంది ప్రధానంగా వేలం పాటలో పాల్గొన్నారు. రూ.1016తో ప్రారంభమై హోరాహోరీగా సాగిన పోరులో రూ.39 లక్షలకు సాహెబ్ నగర్ కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి 21 కిలోల లడ్డును వేలం పాటలో దక్కించుకున్నారు. తాజాగా 33వ సారి బాలాపూర్ గణేష్ లడ్డును వేలం పాటలో దక్కించుకున్న జాబితాలో సామ ప్రణీత్ రెడ్డి చేరిపోయారు.

# కీరదోసతో 'కండోమ్ క్లాస్'

- **విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించిన బయాలజీ టీచర్**
- **'అవగాహన అవసరమే' అంటున్న కొందరు..**
- **'మరీ ఇంత వివరమా?' అంటున్న మరికొందరు**

**పూర్నియా, సెప్టెంబర్ 25 :** విద్యార్థులకు ఓ బయాలజీ టీచర్ కండోమ్ క్లాస్ చెప్పారు. కండోమ్‌ను, కీరదోసను ఉపయో గించి.. కండోమ్ వినియోగంలో చేయకూడని పొరపాట్ల గురించి వివరించారు. సెక్స్ ఎడ్యుకేషన్‌లో భాగంగా 'మానవ పునరుత్పత్తి వ్యవస్థ, ఆరోగ్యం' అనే టాపిక్‌ను ఆయన బోధించారు. ఈ టాపిక్‌లో భాగంగా కండోమ్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. బీహార్ లోని పూర్నియా లోగల ఓ స్కూల్‌లో జరిగిన ఈ క్లాస్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియా లో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై నెటిజన్‌ల నుంచి మిశ్రమ స్పందన వస్తున్నది. బీహార్‌కు చెందిన చందన్ కుమార్ పండిత్ అనే బయాలజీ టీచర్ ఈ క్లాస్ చెప్పారు. ఆయన తనను తాను ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఇండియాస్ వైరల్ బయాలజీ సర' గా పరిచయం చేసుకుని తన క్లాస్‌లకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పెడుతుంటారు. ఇప్పుడు ఆయన పోస్ట్ చేసిన కండోమ్ క్లాస్ వీడియో కొన్ని నిమిషాల్లోనే లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. పుస్తకాల్లోని చదువుతోపాటు ఇలాంటి సున్నితమైన అంశాలపై ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రాక్టికల్ అవగాహన కల్పించడం ఎంతో అవసరమని చందన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కండోమ్ వినియోగంతో ఉండే ప్రయోజనాలు, వినియోగంలో చేయకూడని పొరపాట్లు, జనాభా నియంత్రణలో, సుఖ వ్యాధుల నియంత్రణలో కండోమ్‌ల పాత్ర గురించి ఆ బయాలజీ టీచర్ వివరించిన విధానాన్ని పలువురు సమర్థిస్తున్నారు. కానీ మరికొందరు మాత్రం ఆ టీచర్ తీరును తప్పుపడుతున్నారు. కండోమ్ వినియోగం గురించి కీరదోసను ఉపయోగించి మరీ అంత వివరించాల్సిన అవసరం లేదని విమర్శిస్తున్నారు. ఇదిలావుంటే పునరుత్పత్తి ఆరోగ్యంపై తరగతి గదిలో బోధించే పద్ధతులపై ఈ వీడియో కొత్త చర్చకు దారితీసింది.

# రాహుల్ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

- **ప్రధాని, హోంమంతిపై వ్యాఖ్యలు దురదృష్టకరం**
- **ఫిరాయింపులు ప్రోత్సహిస్తూ ఓట్ చోరీ అనడం ద్వంద్వ వైఖరి**
- **రాజ్యాంగబద్ధ సంస్థలు, బలగాలపై నమ్మకం లేకపోవడం సిగ్గుచేటు**
- **రాహుల్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:**

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రజలచే ఎన్నికైన ప్రధానమంత్రి, హోంమంత్రిని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశద్రోహి అని వ్యాఖ్యానించడం ఆయన మానసిక దుస్థితికి, అసహనానికి నిదర్శనమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. వరుస ఓటములతో మానసిక సమతుల్యత కోల్పోయిన రాహుల్ గాంధీ బహిరంగంగా మాట్లాడే ముందు మానసిక వైద్యుడిని సంప్రదిస్తే మంచిదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

**అసలైన 'ఓట్ చోరీ' కాంగ్రెస్‌దే**

బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేయడాన్ని స్వాగతించి క్షమాపణలు చెప్పాల్సింది పోయి ప్రజాస్వామ్య పాఠాలు చెప్పడం హాస్యాస్పదమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇతర పార్టీల టికెట్లపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడమే అసలైన 'ఓట్ చోరీ' అని దుయ్యబట్టారు. ప్రజల తీర్పును దొంగిలించిన కాంగ్రెస్‌కు ఇతరులపై ఆరోపణలు చేసే నైతిక హక్కు లేదన్నారు.

**రాజ్యాంగ సంస్థలపై నమ్మకం లేదు:**

కాంగ్రెస్ పార్టీకి సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్, ఈవీఎంలు, దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలతో పాటు దేశాన్ని కాపాడే సాయుధ బలగాలపై కూడా నమ్మకం లేదని విమర్శించారు. విచారణ సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేతలు నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీ బెయిల్‌పై బయట ఎందుకు తిరుగుతున్నారో ఆత్మవిమర్శ చేసుకోవాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం గెలిచినట్లు, ఇతర పార్టీలు గెలిస్తే ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగినట్లు మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందన్నారు.

**ఓటర్లను అవమానించడం సిగ్గుచేటు**

భారత ఓటర్లను ఇరాక్, ఉత్తర కొరియా ప్రజలతో పోల్చడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని కిషన్ రెడ్డి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గౌరవం పొందుతున్న ప్రధానమంత్రిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం తగదని, రాహుల్ గాంధీ తన వైఖరిని మార్చుకోకపోతే గతంలో కాంగ్రెస్‌కు పట్టిన గతే మళ్లీ పడుతుందని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.





# సీఈసీపై క్రిమినల్ దర్యాప్తు చేపట్టండి

- సుప్రీంకోర్టులో పిల్ దాఖలు
- వోటర్ల జాబితా సవరణలో ఏకపక్ష నిర్ణయాలు,
- అక్రమ డిలీట్లపై అడ్వకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి పిటిషన్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ పై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టాలని అందులో డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అక్రమ రీతిలో వోట్లను డిలీట్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. సీఈసీ జానేశ్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తన బాధ్యతలను ఉల్లంఘించినట్లు అడ్వకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ఆయన ఆ పిల్ దాఖలు చేశారు. వోటర్ల రివిజన్ ప్రక్రియ కోసం అనేక నిర్ణయాలను తమ ఆమోదం లేకుండానే తీసుకున్నట్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఆరోపించిన విషయం తెలిసిందే. సీఈసీ తీసుకున్న నిర్ణయాలు, మార్గదర్శకాలు, సూచనలు, సాఫ్ట్ వేర్ మార్పులను తక్షణమే రద్దు చేయాలని కోరారు. 'సర్' ప్రక్రియతో సంబంధం ఉన్న అంశాల్లో 14 సార్లు సీఈసీ జ్ఞానేశ్ను వ్యతిరేకించినట్లు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి ఆరోపించారు.

# పర్యాటక కేంద్రం వద్ద అమ్మాయికి వేధింపులు

- బీహార్‌లో మరో ఘటన..
- ఆరుగురిపై కేసు
- మందార పర్వతం వద్ద యువతిపై దాడి..

**బంకా, సెప్టెంబర్ 25 :** బీహార్‌లో యువతులపై వేధింపులకు సంబంధించిన వీడియోలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా బంకా జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన మందార పర్వతం వద్ద ఓ యువతిని కొందరు యువకులు వేధించినట్లు చూపుతున్న వీడియో బయటపడింది. ఘటనకు సంబంధించి బౌన్సీ పోలీసులు ఆరుగురు గుర్తుతెలియని యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైరల్ వీడియోలో యువతితో కొందరు అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఆమెను చెప్పుతో కొట్టేందుకు ప్రయత్నించిన దృశ్యాలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మరో యువకుడి చేతిలో కర్ర కూడా కనిపించినట్లు కథనాలు వెల్లడించాయి. వీడియోలో సెప్టెంబర్ 3 తేదీ కనిపిస్తున్నప్పటికీ, ఘటన ఎప్పుడు జరిగిందన్న అంశంపై భిన్న సమాచారం వెలువడుతోంది. పోలీసు వర్గాలను ఉటంకించిన తాజా కథనాల ప్రకారం ఘటన జూన్‌లో జరిగి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

**వాట్సాప్‌కు వీడియో.. రంగంలోకి పోలీసులు**

సెప్టెంబర్ 22న సామాజిక మాధ్యమాల విభాగం ద్వారా వీడియో పోలీసుల దృష్టికి వచ్చింది. బౌన్సీ పోలీస్ స్టేషన్ అధికారి పంకజ్ కుమార్ ఝా వాట్సాప్‌కు మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో వీడియో చేరడంతో పోలీసు బృందం మందార పర్వతానికి వెళ్లి దృశ్యాల్లో కనిపించిన ప్రాంతాన్ని పరిశీలించింది. వీడియో చిత్రీకరించిన ప్రదేశం మందార పర్వతమేనని నిర్ధారించిన అనంతరం కేసు నమోదు చేశారు. ఆరుగురు గుర్తుతెలియని యువకులపై భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్లతోపాటు సమాచార సాంకేతిక చట్టం కింద కేసు నమోదు చేశారు. వీడియోలో కనిపిస్తున్న యువకులు, బాధిత యువతి వివరాలను గుర్తించేందుకు స్థానికులు, వ్యాపారులను పోలీసులు విచారిస్తున్నారు. కొందరు అనుమానితులను గుర్తించినట్లు తాజా కథనాలు పేర్కొంటున్నప్పటికీ, దర్యాప్తు కొనసాగుతోంది.

**వరుస వీడియోలతో కలకలం**

ఇటీవల జమూయి, సమస్తిపూర్ జిల్లాల్లోనూ యువతులపై వేధింపులకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. జమూయి ఘటనలో పోలీసులు పలువురిని గుర్తించి అరెస్టులు చేశారు. తాజాగా బంకా ఘటనకు సంబంధించిన వీడియో బయటకు రావడంతో మహిళల భద్రత అంశం మరోసారి చర్చకు వచ్చింది.



# మహిళతో ప్రధాని మోదీ మార్ఫ్‌డ్ ఫొటో

- సీజేపీకి ఢిల్లీ హైకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 :** ఒక మహిళతో ప్రధాని మోదీ ఉన్న ఏఐ మార్ఫ్‌డ్ ఫొటోను సీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ఈ పోస్టును తొలగించాల్సిందిగా మెటా సంస్థను ఆదేశించింది. అలాగే, సీజేపీ సహా ఆ సంస్థ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కీలక నేతలు అశుతోష్ రాంకా, రత్నా సింగ్ లకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రధాని మోదీ ఒక మహిళతో ఉన్నట్లు మార్ఫింగ్ చేసిన ఫొటోను ఇటీవల సీజేపీ నేతలు సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేశారు. దీంతో ఈ అంశంపై బాధిత మహిళ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది. జస్టిస్ గిరీష్ కత్పాలియా ఆధ్వర్యంలోని బెంచ్ దీనిపై విచారణ జరిపింది. ఈ అంశం ఒక అసాధారణ పరి స్థితికి సంబంధించిందన్నారు. ఎందుకంటే ఒక సాధారణ మహిళతోపాటు దేశ ప్రధాని ఉన్న ఫొటోకు సంబంధించిన అంశమని కోర్టు వ్యాఖ్యానించింది. ఢిల్లీ పోలీసులు ఈ విషయంలో సున్నితంగా వ్యవహరించకపోతే కోర్టు సున్నితంగా స్పందిస్తుందని తెలిపింది. ఈ అంశంలో సీజేపీ నేతలకు నోటీసులు జారీ చేసిన కోర్టు ఫొటోలు, దీనికి సంబంధించి అన్ని పోస్టులు తొలగించాలని సోషల్ మీడియా సంస్థ మెటాను ఆదేశించింది.

# జ్ఞానేష్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలు

- బీహార్‌లో కార్యకర్తలపై వాటర్ కెనాన్ల ప్రయోగం
- అస్సాంలో గౌరవ్ గొగోయ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పాట్నాలో కాంగ్రెస్ కార్యకర్తలపై వాటర్ కెనాన్ల ప్రయోగం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 :** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తన దేశవ్యాప్త ఆందోళనను శుక్రవారం ప్రారంభించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఆయన ఆధ్వర్యంలో తీసుకున్న అన్ని నిర్ణయాలు, ఓటర్ల జాబితా మార్పులపై స్వతంత్ర సమీక్ష జరపాలని డిమాండ్ చేస్తూ తమతమ రాష్ట్ర ఎన్నికల సంఘాల కార్యాలయాల వరకు శుక్రవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని కాంగ్రెస్ తన రాష్ట్ర విభాగాలను గురువారం ఆదేశించింది. ఈ మేరకు ఢిల్లీ, పాట్నా, జమ్మూ, కోల్‌కతా, పంజాబ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ వరకు జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం వీధుల్లోకి వచ్చారు. ఢిల్లీలో పార్టీ నాయకులు బ్యారికేడ్లను బద్దలుకొట్టి ఎన్నికల కమిషన్ కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి.. దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే మౌనంగా కూర్చోబోము.. దీనికి బాధ్యులైన వారిని శిక్షిస్తాము' అని కాంగ్రెస్ ఢిల్లీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ నినదించారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ఆయన ముఖం ఉన్న మాస్కులు ధరించి, చేతులకు సంకెళ్లు వేసుకుని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీలో నిరసన తెలిపారు. పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించారు. అస్సాంలో సీఈసీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్‌తోపాటు పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీహార్ రాజధాని పాట్నాలో ఎన్నికల సంఘం కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసులు వాటర్ కెనాన్లను ప్రయోగించారు. కోల్‌కతా, చండీగఢ్, జమ్మూ సహా పలు రాష్ట్ర రాజధానులలో, ఇతర ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ పార్టీ నిరసన ప్రదర్శనలను నిర్వహించింది.

# యువతతో మోడీ 'భజన్ క్లబ్బింగ్'

- ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ పార్క్‌లో ప్రత్యేక కార్యక్రమం
- యువతతో కలిసి భక్తి గీతాలను ఆస్వాదించిన ప్రధాని
- చప్పట్లు కొడుతూ.. కంజర వాయిస్తూ ఉత్సాహం
- • సంప్రదాయ భజనలకు ఆధునిక సంగీత హంగులే 'భజన్ క్లబ్బింగ్'
- జెన్ జెడ్‌లో ఆదరణ పొందుతున్న కొత్త సంగీత ధోరణి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం యువతతో కలిసి 'భజన్ క్లబ్బింగ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ పార్క్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన భక్తి గీతాలను ఆస్వాదించారు. ముందు వరుసలో కూర్చున్న మోడీ భజనలకు అనుగుణంగా చప్పట్లు కొడుతూ కనిపించారు. ఓ భజన సందర్భంగా కంజర వాయిద్యాన్ని కూడా వాయించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొని భజనలకు అనుగుణంగా చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా గడిపారు.

'భజన్ క్లబ్బింగ్' అంటే.. సంప్రదాయ భక్తి గీతాలకు ఆధునిక సంగీత కచేరీల హంగులు జోడించి నిర్వహించే కార్యక్రమమే 'భజన్ క్లబ్బింగ్'. లైవ్ మ్యూజిక్, ఆధునిక వాయిద్యాలతో ఉత్సాహభరిత వాతావరణంలో భజనలు, కీర్తనలు ఆలపించడం దీని ప్రత్యేకత. సాధారణ క్లబ్బింగ్‌కు భిన్నంగా ఇందులో భక్తి, ఆధ్యాత్మిక గీతాలకే ప్రాధాన్యం ఉంటుంది. ఈ తరహా కార్యక్రమాలు జెన్ జెడ్ యువతలో ఆదరణ పొందుతున్నాయి.

ఢిల్లీలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో 'భజన్ క్లబ్బింగ్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మాలవీయ నగర్ మార్కెట్ లోనూ ఇలాంటి కార్యక్రమం జరిగింది. సంప్రదాయ భక్తి సంగీతాన్ని ఆధునిక ప్రదర్శన శైలితో యువతకు చేరువ చేయడం వీటి ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు పేర్కొంటున్నారు.

# 'బ్రహ్మోస్'తో పాక్‌కు నిద్రలేని రాత్రులు!

- అమేఠీ ఏకే-203 రైఫిళ్లతో మావోయిస్టులు, ఉగ్రవాదులకు వణుకు
- యూపీని గుండారాజ్యం నుంచి సుపరిపాలన వైపు నడిపించిన సీఎం యోగి ఆదిత్యనాథ్
- నోయిడాలో 'ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన'ను ప్రారంభించిన అమిత్ షా

**గ్రేటర్ నోయిడా, సెప్టెంబర్ 25 :** ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు 'నిద్రలేని రాత్రులు' మిగులుస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అమేఠీలో తయారవుతున్న ఏకే203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదుల్లో భయం పుట్టిస్తున్నాయని అన్నారు. గ్రేటర్ నోయిడాలో శుక్రవారం ప్రారంభమైన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి పాల్గొన్న అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను అమిత్ షా తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఆ సమయంలో బ్రహ్మోస్ క్షిపణులను సమర్థంగా వినియోగించామని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో బ్రహ్మోస్ క్షిపణుల అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, పరీక్షల కేంద్రం ఏర్పాటైందని, 2025 అక్టోబర్‌లో అక్కడ తయారైన తొలి బ్యాచ్‌ను పంపించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రక్షణ పారిశ్రామిక కారిడార్‌లోని ఆరు కేంద్రాల్లో పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా తెలిపారు. ఒకప్పుడు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రక్షణ రంగం, వాహన తయారీ, వైద్య పరికరాలు సహా అనేక రంగాల్లో రాష్ట్రం ముందుకు వెళ్తోందని ఆయన పేర్కొన్నారు. ఇవి రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై అమిత్ షా చేసిన అంచనాలు. మాఫియా పాలన నుంచి పెట్టుబడుల కేంద్రంగా 2017కు ముందు ఉత్తర్‌ప్రదేశ్‌లో మాఫియా ప్రభావం తీవ్రంగా ఉండేదని అమిత్ షా ఆరోపించారు. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని, అదే పెట్టుబడులకు అనుకూల పరిస్థితులను సృష్టించిందని పేర్కొన్నారు. 2013లో అప్పటి సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడుల సదస్సును లక్నోలో నిర్వహించలేక ఢిల్లీకి తరలించాల్సి వచ్చిందని కూడా ఆయన చెప్పారు. ఇవి రాజకీయ ప్రత్యర్థుల పాలనపై షా చేసిన విమర్శలు.

**'ఒక జిల్లాఒక ఉత్పత్తి'పై ప్రశంసలు**

ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఒక జిల్లాఒక ఉత్పత్తి' కార్యక్రమాన్ని అమిత్ షా ప్రశంసించారు. స్థానిక ఉత్పత్తులకు దేశ, విదేశీ మార్కెట్లను అందించేందుకు అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా సంబంధిత నూతన వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు జరిగే ఈ ప్రదర్శనలో



రక్షణ, వాహనాలు, ఎలక్ట్రానిక్స్, ఆహార ఉత్పత్తులు, వస్త్రాలు, ఔషధాలు, పర్యాటకం సహా అనేక రంగాలకు చెందిన సంస్థలు పాల్గొంటున్నాయి. దేశీయ తయారీని విస్తరించి భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని అమిత్ షా పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వాల విధానాల వల్ల ఉత్తర్‌ప్రదేశ్‌లో పెట్టుబడుల వాతావరణం మారిందని ఆయన అన్నారు

# నాలుగేళ్లలో 111 మంది పార్టీ జంప్

- 2022-26 మధ్య పార్టీలు మారిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఏడీఆర్ నివేదిక
- జాబితాలో 26 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు
- పార్టీ మారిన వారిలో మరో 78 మంది ఎమ్మెల్యేలు
- నాగాలాండ్‌లో అత్యధికంగా 32 ఫిరాయింపు కేసులు
- తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి తొమ్మిది మంది ఎమ్మెల్యేలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** దేశవ్యాప్తంగా పార్టీ ఫిరాయింపులు కొనసాగుతున్నాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. 2022 నుంచి 2026 మధ్య నాలుగేళ్ల కాలంలో ఎన్నికల్లో గెలిచిన 111 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీలు మారినట్లు పేర్కొంది. వీరిలో 26 మంది లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ సభ్యులు, 78 మంది ఎమ్మెల్యేలు ఉన్నట్లు తెలిపింది. నాగాలాండ్‌లో అత్యధికంగా 32 ఫిరాయింపు కేసులు నమోదవగా, పశ్చిమ బెంగాల్ తర్వాతి స్థానంలో నిలిచింది.

నాగాలాండ్‌లో అత్యధికం నాగాలాండ్‌లో ఎన్డీపీపీ, ఎన్‌పీఎఫ్ మధ్య చోటుచేసుకున్న రాజకీయ సమీకరణాల్లో భాగంగా అత్యధిక ఫిరాయింపులు నమోదయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో 20 మంది ప్రజాప్రతినిధులు టీఎంసీని వీడి మరో పార్టీలో చేరినట్లు నివేదిక పేర్కొంది. తెలంగాణలో బీఆర్ఎస్ తరఫున గెలిచిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలు అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. గోవాలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ గూటికి చేరారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన నుంచి ఎన్నికైన పలువురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. మేఘాలయలో ఐదుగురు, అరుణాచల్‌ప్రదేశ్, గుజరాత్‌లో నలుగురు చొప్పున, మణిపూర్‌లో ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీలు మారారు. హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్‌లో ఇద్దరు చొప్పున, కర్ణాటక, మధ్యప్రదేశ్, సిక్కిం, ఉత్తరప్రదేశ్‌లో ఒక్కొక్కరు పార్టీ మారినట్లు ఏడీఆర్ పేర్కొంది. మూడు పార్టీల నుంచే 58 శాతం పార్టీలవారీగా ఎన్డీపీపీ నుంచి అత్యధికంగా 25 మంది బయటకు వెళ్లగా, టీఎంసీ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి 19 మంది, బీఆర్ఎస్ నుంచి తొమ్మిది మంది పార్టీలు మారారు. ఆప్, ఎన్సీపీల నుంచి ఏడుగురు చొప్పున, శివసేన నుంచి ఆరుగురు, జేడీయూ నుంచి ఐదుగురు, ఎన్‌పీపీ నుంచి నలుగురు ఇతర పార్టీల్లో చేరారు. మొత్తం 111 ఫిరాయింపుల్లో ఎన్డీపీపీ, టీఎంసీ, కాంగ్రెస్ నుంచే 64 కేసులు నమోదయ్యాయని, ఇది సుమారు 58 శాతమని నివేదిక వెల్లడించింది. పార్టీ మారిన ప్రజాప్రతినిధులను చేర్చుకోవడంలో ఎన్‌పీఎఫ్ 32 మందితో ముందుండగా, బీజేపీలో 29 మంది చేరారు. మరో పార్టీలో 20 మంది చేరినట్లు నివేదిక పేర్కొంది. కాంగ్రెస్‌లో తొమ్మిది మంది, శివసేనలో ఎనిమిది మంది, ఎన్‌పీపీలో ఆరుగురు, అరుణాచల్ పీపుల్స్ పార్టీలో నలుగురు చేరారు. కొన్ని రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు, ప్రభుత్వాల మార్పునకు ఫిరాయింపులు కూడా కారణమయ్యాయని ఏడీఆర్ పేర్కొంది.

# గణనాధుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

## ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దేశగోని శ్రీనివాస్ గౌడ్

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ పరిధిలోని బాలాజీ కాలనీలో కృష్ణ ఆహ్వానం మేరకు నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 9వ డివిజన్ ప్రధాన కార్యదర్శి, గీత కార్మిక సంఘం నాయకుడు దేశగోని శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజల మధ్య ఐక్యతతో ముందుకు సాగితే స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీపీఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ అధ్యక్షుడు మునికుంట్ల నరేష్ గౌడ్, బీపీఎం కాలనీ ప్రధాన కార్యదర్శి రావు నాగిరెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొడిగె సాయిరాం గౌడ్, 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అడాల అమర్‌నాథ్, సిద్దాబత్తుల సుధాకర్, గుత్తి వెంకటరమణ, రాపల్లి వేణు, పాటు డీఎంఎస్‌జీ యువసేన సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# డీజే శబ్దాలతో బధిరులకు మానసిక క్షోభ

**కుక్క కాటుపై అప్రమత్తంగా ఉండాలి: వైద్యాధికారి డా. శ్రవణ్ కుమార్**

**ఖమ్మం,, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తెలంగాణ గురుకుల బాలికల విద్యాలయంలో బధిరుల ఆరోగ్య అవగాహన మరియు ప్రపంచ రాబిస్ నివారణ అవగాహన సదస్సులు నిర్వహించారు.వైద్యాధికారి డా. శ్రవణ్ కుమార్ మరియు కళాశాల ప్రిన్సిపల్ విజయకుమారి సంయుక్త అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా డా. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, సెప్టెంబర్ చివరి వారంలో నిర్వహించే బధిరుల అవగాహన వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో వినికిడి లోపం ఉన్నవారిని కించపరచకుండా వారు కూడా జనజీవన స్రవంతిలో కలిసేలా అనువైన వాతావరణం, సమాన అవకాశాలు కల్పించాలని కోరారు.ప్రస్తుతం పెరిగిపోతున్న డీజే సౌండ్స్ సంస్కృతిపై ఆందోళన వ్యక్తం చేశారు. శుభకార్యాలు, రాజకీయ ర్యాలీలలో వాడుతున్న విపరీతమైన డీజే శబ్దాల వల్ల బధిరులు తీవ్ర మానసిక క్షోభకు గురై పూర్తి వినికిడి శక్తిని కోల్పోతున్నారని, ఇది సామాన్య ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని హెచ్చరించారు. యువత, విద్యార్థులు డీజేలను ప్రోత్సహించకుండా జాగ్రత్త వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం రాబిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ, రాబిస్ అనేది వైరస్ వల్ల కుక్కల నుండి మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వ్యాధి అని తెలిపారు. వీధి కుక్కలు కరిచిన వెంటనే ఆలస్యం చేయకుండా రాబిస్ టీకా తీసుకోవాలని, పెంపుడు కుక్కలకు సకాలంలో టీకాలు ఇప్పించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని చెప్పారు. కుక్క కాటుకు గురైన వ్యక్తిలో నీటికి, గాలికి భయపడడం (హైడ్రోఫోబియా), జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్యం అందించాలని, లేనిచో మరణానికి దారితీస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి చంద్రశేఖర్, జూనియర్ కళాశాల సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.



# రేడియల్ రోడ్డు బాధిత రైతులకు న్యాయం చేయాలి

- రీ-సర్వే నిర్వహించాలని మంత్రి శ్రీధర్ బాబుకు వినతి
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి

**షాబాద్, రాజముద్ర న్యూస్:** షాబాద్ మండలంలోని సంకేపల్లిగూడ గ్రామ రైతులు రేడియల్ రోడ్డు నిర్మాణం కారణంగా తమ భూములను కోల్పోతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి తెలిపారు. రేడియల్ రోడ్డు కోసం భూముల సేకరణలో భాగంగా రైతుల భూముల కొలతలు, సరిహద్దుల విషయంలో స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సంకేపల్లిగూడ గ్రామ పరిధిలో భూములను సమగ్రంగా రీ-సర్వే చేయించాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జ్, మంత్రి శ్రీధర్ బాబును కలిసి రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు నష్టం కలగకుండా క్షుణ్ణంగా పరిశీలించి రీ-సర్వే నిర్వహించాలని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబును మధుసూదన్ రెడ్డి కోరారు. రైతుల సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



# చందిప్పలో ఘనంగా హనుమాన్ దేవాలయ విఘ్నేశ్వరుడి శోభాయాత్ర

- కన్నుల పండుగగా గణపతి నిమజ్జోత్సవ వేడుకలు..
- రూ. 2,12, 000 లడ్డును కైవసం చేసుకున్న సర్పంచ్ మల్లికార్జున్





**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో శ్రీ రామలింగేశ్వర యూత్ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయం గణపతి శోభాయాత్ర అంగరంగ వైభవంగా, కన్నుల పండుగల ఘనంగా నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలతో ప్రారంభమైన శోభాయాత్ర గ్రామ ప్రధాన వీధుల గుండా సాగింది. ముందు భాగంలో యువకులు సంప్రదాయ బద్దంగా నడువగా, వెనుక ట్రాక్టర్ పై అందంగా అలంకరించిన భారీ వినాయకుడి విగ్రహం కొలువుదీరింది. విగ్రహం చుట్టూ రంగు రంగుల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరణ అందరినీ ఆకట్టుకుంది.ఈ శోభాయాత్రకు ప్రత్యేకంగాy మహారాష్ట్ర బ్యాండ్ మేళాన్ని తీసుకురావడంతో యువత ఉత్సాహంతో నృత్యాలు చేశారు. బ్యాండ్ మేళా వాయిద్యాలకు అనుగుణంగా యువతీ యువకులు చేసిన నృత్యాలు, డ్యాన్సులు అందరినీ అలరించాయి. డోలు వాయిద్యాలతో గ్రామం మొత్తం దద్దరిల్లింది. గణపతి బప్పా మోరియా, జై బోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ చేసిన నినాదాలతో గ్రామం మార్మోగిపోయింది.ఈ శోభాయాత్రలో గ్రామ ప్రజలు, మహిళలు, పెద్దలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. మహిళలు మంగళ హారతులు చేత పట్టి గణనాథుడికి స్వాగతం పలికారు. యూత్ సభ్యులు క్రమశిక్షణతో, భక్తి భావంతో శోభాయాత్రను విజయవంతంగా నిర్వహించారు.రామలింగేశ్వర యూత్ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయంలో జరిగిన వినాయక లడ్డు వేలం పాట గ్రామ చరిత్రలో నిలిచిపోయేలా జరిగింది. గ్రామ సర్పంచ్ మాధొల్ల మల్లికార్జున్ వరుసగా రెండో సారి లడ్డును కైవసం చేసుకుని రికార్డు సృష్టించారు. ఈ ఏడాది వేలంలో ఏకంగా రూ. 2,12,000/– వేలంలో లడ్డును రెండవ లడ్డూ రూ.1,75,000 కొత్తగూడెం రాఘవేందర్ గౌడ్, పండ్లను రూ.1,01,000 కడకంచి విజయ్ కుమార్ సొంతం చేసుకున్నారు. సర్పంచ్ మాధొల్ల మల్లికార్జున్ మాట్లాడుతూ.... తాను హనుమాన్ దేవాలయం వినాయక లడ్డును 2వ సారి కైవసం చేసుకున్నాను తెలిపారు. ఇది తన జీవితంలో దక్కిన అదృష్టంగా భావిస్తున్నన్నారు. ఈ లడ్డు తీసుకోవడం వలన నా కోరికలు అన్ని విధాలుగా తీరుతాయన్నారు. గతంలో తాను అనుకున్న పనులు, తన కుటుంబానికి సంబంధించిన కోరికలు, గ్రామ అభివృద్ధి కోసం అనుకున్న అనులు నెరవేరాయన్నారు. హనుమాన్ దేవాలయం వినాయక లడ్డును దక్కించుకున్న తనకు ఎన్నో ప్రయోజనాలు చేకూరాయన్నారు. వ్యాపారంలో, కుటుంబంలో, రాజకీయంగా అన్ని విధాలుగా కలిసి వచ్చిందన్నారు. గణపతి బప్పా దయ వల్లనే ఇదంతా సాధ్యమైందన్నారు.

**గ్రామస్తుల హర్షం...**

శ్రీ రామలింగేశ్వర యూత్ సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు సర్పంచ్ మాధొల్ల మల్లికార్జున్ ను శాలువాతో సత్కరించి, ఘనంగా అభినందించారు.లడ్డు వేలం ద్వారా వచ్చిన రూ.2,12,000 నగదును హనుమాన్ దేవాలయ అభివృద్ధికి, ఆలయంలో మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తాం అని తెలిపారు. చందిప్ప గ్రామంలో ఇంత ఘనంగా వినాయకుడి శోభాయాత్ర నిర్వహించడం పట్ల గ్రామ పెద్దలు శ్రీ రామలింగేశ్వర యూత్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. యువతలో భక్తి భావం, ఐక్యత పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధ్యక్షతన భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త, ఏకాత్మ మానవతావాద ప్రతిపాదకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.సమాజంలో చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు అందాలనే అంత్యోదయ స్ఫూర్తితో దేశానికి మార్గనిర్దేశం చేసిన దీన్ దయాళ్ చిత్రపటానికి గత పాలేరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఇంగువ రామకృష్ణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల అభ్యుదయం కోసం ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ప్రపంచ దేశాలు మోదీని విశ్వగురుగా కీర్తిస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా స్టేట్ ఈసీ మెంబర్ షేక్ షర్ఫుద్దీన్, బీజేపీ మండల నాయకులు మల్లెబోయిన గోవిందరావు, పురాణం దివాకర్, భాజా రామకృష్ణ, నున్నా వెంకయ్య, సురేపల్లి జ్ఞానరత్నం, రావెళ్ల మురళి, పిట్టల సూరిబాబు, సురేపల్లి అనసూయమ్మ, ధారావత్ వీరు నాయక్, ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడే కార్యకర్తలకు న్యాయం జరిగేదెప్పుడు...

- కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను పట్టించుకోరా...
- ఊరేళ్ళ వార్డు కాంగ్రెస్ నాయకుడు షరీఫ్ ఖాన్



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా కష్టకాలంలో జెండాను మోసి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి, పార్టీని బలోపేతం చెయ్యడానికి కష్ట పడ్డ కార్యకర్తలను పట్టించుకునే నాథుడే లేడని చేవెళ్ల మున్సిపల్ ఊరెళ్ళ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు షరీఫ్ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఆధికారంలోకి వచ్చినప్పటి నుండి నేటి వరకు ఒకసారి కూడా పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పాటునందించిన కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఎలక్షన్ సమయంలో కాంగ్రెస్ పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డ కార్యకర్తలకు తగిన గుర్తింపు లేకపోవడం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను నిరాశకు గురిచేస్తుందన్నారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు, కార్యకర్తల సమావేశం నిర్వహించి పార్టీ కోసం కష్ట పడే వారికి న్యాయం చేయాలని అయన కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.మై భారత్ వాలంటీర్ కొక్కిరేణి నాగపృథ్వీరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి యువతలో సృజనాత్మకతను వెలికితీశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ మాట్లాడుతూ.. దేశ నిర్మాణంలో, సమాజ సేవలో యువశక్తి పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ పరంజ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. వై. శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. ఎస్. రమేష్, డా. ఆర్. వెంకట్రాజం, డా. మార్జియానా, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ధనలక్ష్మి యువసేన ఆధ్వర్యంలో అన్నదానం

**30 వసంతాలు పూర్తి చేసుకున్న ధనలక్ష్మి యువసేన**



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్ నంబర్ 2 లోని ధనలక్ష్మి గ్రౌండ్స్‌లో ధనలక్ష్మి యువసేన ఆధ్వర్యంలో 30వ వార్షిక అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు దశాబ్దాలుగా నిరాటంకంగా సాగుతున్న ఈ సేవా కార్యక్రమంలో వందలాది మంది భక్తులు, కార్మికులు, స్థానికులకు తాజా భోజనాన్ని అందించారు. కమిటీ ప్రతినిధులు చిత్రోజి మహేష్, రావెల్ షా, సాయి చరణ్, అమర్నాథ్, పవన్ నాయుడు, సాయినాథ్ తదితర యువకులు ఏర్పాట్లను పర్యవేక్షించగా, మూడు దశాబ్దాలుగా తమకు అండగా నిలుస్తున్న స్థానిక పెద్దలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు హాజరై నిర్వాహకుల సేవా తత్పరతను ప్రశంసించారు.

# ఘనంగా సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు, శంకర్ పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం రోజు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, బంధువులు, శ్రేయోభిలాషుల మధ్యన ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే ఆయన నివాసానికి, అభిమానులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు భారీగా తరలివచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు, కౌన్సిలర్లు, సొసైటీ డైరెక్టర్లు పూల బొకేలు, శాలువాలతో శశిధర్ రెడ్డిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ....బద్దం శశిధర్ రెడ్డి శంకర్ పల్లి పట్టణ అభివృద్ధికి, సొసైటీ చైర్మన్ గా రైతుల సంక్షేమానికి చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునే గొప్ప మనసున్న నాయకుడు అని ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో శంకర్ పల్లి మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.ఈ జన్మదిన వేడుకకు బిఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, శంకర్ పల్లి సొసైటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, రైతులు, వ్యాపారస్తులు హాజరయ్యారు.

# కేపీహెచ్‌బీ ఎల్ఐజి ఫ్లాట్స్‌లో ఘనంగా గణేష్ నవరాత్రులు

**అన్నప్రసాద వితరణను ప్రారంభించిన సతీష్ ఆరోరా**



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ పరిధిలోని ఎల్ఐజి ఫ్లాట్స్‌లో వినాయక చవితి నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వీబీఎస్ పంతులు, వెంకట్ నారాయణల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి కో-ఆర్డినేటర్ రెడ్డి సతీష్ ఆరోరా ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాతూరి గోపి, గోర్తి రాజేష్ రాయ్, వలవల నాయుడు, బి. రవి, వెంకట్ నారాయణ, సత్యనారాయణ, చైతన్య, సత్తిబాబు తదితరులతో పాటు కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాయి కాలనీలో యువ గణేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం...



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు సాయి కాలనీలో యువ గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు యువ గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతికి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. తర్వాత అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అన్నదాన కార్యక్రమంలో శంకర్ పల్లి మున్సిపల్ నాయకులు, భక్తులు, కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మతసామరస్యానికి ప్రతీకగా

- రాజు కాలనీ వినాయక చవితి వేడుకలు
- ముస్లిం సోదరులకు ఘన సత్కారం

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** బాలానగర్ డివిజన్ రాజు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో దుర్గా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకలు కులమతాలకు అతీతంగా, మతసామరస్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. మండపం ఏర్పాట్ల నుంచి భక్తులకు మంచినీరు, ప్రసాదాల పంపిణీ, భద్రతా బాధ్యతల వరకు స్థానిక ముస్లిం మైనారిటీ పెద్దలు, సోదరులు క్రియాశీలకంగా పాల్గొని సోదరభావాన్ని చాటుకున్నారు. మానవత్వమే మన మతమని, అందరూ ఐక్యతతో జీవించాలని ఈ సందర్భంగా ముస్లిం నాయకుడు మాక్బూల్ పిలుపునిచ్చారు. సమాజ హితానికి, సేవాభావానికి ప్రతీకగా నిలిచిన ముస్లిం సోదరులను మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, న్యాయవాది ఎల్.ఎస్. రావు తదితరుల సమక్షంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గొప్పగోని శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్, రూపాని మధు, వెంకటేష్ గౌడ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అవసరాల కనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

**వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేసుకుని అభివృద్ధి పనులను చేపట్టాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్ అన్నారు. విబి జి రామ్ జి వికసిత గ్రామపంచాయతీ ప్రణాళిక (విజిపిపి) రూపకల్పన, అమలుపై వికారాబాద్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ... గ్రామాల సమగ్ర అభివృద్ధికి వికసిత గ్రామపంచాయతీ ప్రణాళిక ఎంతో కీలకమని గ్రామ ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలు, అందుబాటులో ఉన్న వనరులను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళికలను రూపొందించాలన్నారు. గ్రామపంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికాబద్ధంగా చేపట్టడం ద్వారా గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, విద్య, ఆరోగ్యం, ఉపాధి తదితర రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని ఆయన అన్నారు. ఎల్నినో ప్రభావం వల్ల వర్ష పాతం తక్కువగా ఉందని దీన్ని దృష్టిలో పెట్టుకొని పంటల సాగుపై తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వరి సాగును తగ్గించి ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విబి జి రామ్ జి లో భాగంగా కూలీలకు ఉపాధి అవకాశాలను పెంచే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇంకుడు గుంతలు, పంట పొలాల వద్ద నీటి కుంటల ఏర్పాటుకు ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో విజిపిపి ప్రణాళిక రూపకల్పన విధానంలో భాగంగా గ్రామస్థాయిలో అవసరాల గుర్తింపు, నీటి భద్రత, గ్రామీణ జీవనోపాధి, విపత్తుల నిర్వహణ, వివిధ శాఖల సమన్వయం, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో వేసిన పంట పొలాలు, గ్రామ చిత్రపటాల నమూనాలను అధికారులు, సర్పంచులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ పరిశీలించారు. ముందస్తుగానే నమూనాలను రూపొందించుకొని అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, జిల్లా వ్యవసాయ అధికారి కవిత, డిహెచ్ఎస్ఓ ఎంఎ సత్తార్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ ఉమేష్, అడిషనల్ డిఆర్డిఓ సత్తయ్య సంబంధిత జిల్లా మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కొల్లు నర్సింహారెడ్డి మృతికి రెడ్డి సంక్షేమ సంఘం సంతాపం



**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువన గిరి జిల్లా ఆత్మకూర్ (ఎం). మండల కేంద్రానికి చెందిన కొల్లు నర్సింహారెడ్డి (45), తండ్రి వీరారెడ్డి (లేట్), గురువారం రాత్రి 9:30 గంటలకు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి ఆత్మకూర్ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బొబ్బల ఇంద్రారెడ్డి, సంఘం పెద్దలు, పీఏసీఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు యాస ఇంద్రారెడ్డి, సీపీఐ మండల నాయకుడు బొబ్బల లాల్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పద్మారెడ్డి, నోముల వెంకట్‌రెడ్డి, మాజీ ఆత్మకూర్ ఎంపీటీసీ యాస కవిత, సోలిపురం అరుణ, యాస అంజమ్మ, యాస పద్మారెడ్డి, పాశం అనంతరెడ్డి, పిన్నింటి మోహన్‌రెడ్డి, మెట్టు శేఖర్‌రెడ్డి, జిల్లాల మల్లారెడ్డి, నాగం లక్ష్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఏనుగు జాన్‌రెడ్డి, జక్క కొండల్‌రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాగం నర్సింహారెడ్డి, నాగం మల్లారెడ్డి, బి. అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సర్పన్‌పల్లిలో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

**భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికిన గ్రామ ప్రజలు**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ మండల పరిధిలోని సర్పన్‌పల్లి గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెల కొల్పాయి. వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంక రించి, భక్తుల నినాదాలు, డప్పు చప్పుళ్లు, భక్తి గీతాల నడుమ నిమజ్జన ఊరేగింపును నిర్వహించారు. గ్రామంలోని యువత, మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి బప్పా మోరియా అంటూ ఉత్సాహంగా గణనాథుడికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ శైజాది బేగం అయూబ్ ఖాన్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సర్పంచ్ ఫకీర్ ఖాన్ కూడా కార్యక్రమంలో పాల్గొని నిమజ్జన వేడుకలను వీక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శైజాది బేగం అయూబ్ ఖాన్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరూ సోదరభావం, ఐక్యత, శాంతి, సామరస్యంతో పండుగలను జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఉత్సాహభరితంగా సాగడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ సాగర్ వార్డ్ మెంబర్ పెద్ద సత్తయ్య, బాలరాజ్, పెద్ద అనంతయ్య, సుధాకర్, బుజేందర్, నర్సిములు, శ్రీనివాస్, అనంతయ్య, కిష్టయ్య, ఏ ఏం మెమో రియల్ ట్రస్ట్ చైర్మన్ ఆనంద్, మనిందర్, శ్రీనివాస్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దిగ్విజయం గా నమామి భరత్ సామూహిక వందే మాతరం గాన కార్యక్రమం



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన నమామి భరత్ సామూహిక వందే మాతరం గాన కార్యక్రమం "శ్రీ సరస్వతి శిశు మందిర్ హై స్కూల్, కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో భువన విజయమ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం 294 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు, ఆచార్యులు ఎంతో ఉత్సాహంతో, దేశభక్తి భావంతో సామూహికంగా వందే మాతరం గీతాన్ని ఆలపించారు. ప్రతి ఒక్కరి చురుకైన భాగస్వామ్యం సహకారంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు నాగేశ్వర్ రావు, సమితి కోశాధికారి రఘువీర్ రావు, కమిటీ సభ్యులుబి వి ఆర్ మూర్తి, కమిటీ సంయుక్త కార్యదర్శి వెంకట్ రావు, సమితి సంయుక్త కార్యదర్శి రమేష్ ప్రధానోపాధ్యాయులు, అయ్యన్న, పవన్ నర్వ ప్రముఖుల పాల్గొనడం, విద్యార్థులు ఆచార్యుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో నమామి భరత్ సామూహిక వందే మాతరం గాన కార్యక్రమం" అత్యంత ఘనంగా జరిగింది.

# గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన కరాటే వేణుకు మంత్రి పొంగులేటి అభినందన



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఖమ్మం పట్టణానికి చెందిన సుమన్ షూటర్స్ అకాడమీ ఇండియా ఉపాధ్యక్షులు, కరాటే క్రీడాకారుడు కరాటే వేణు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం పట్ల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో వేణును ఆయన అభినందించారు.హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏప్రిల్ 26న నిర్వహించిన ప్రతిష్టాత్మక కరాటే కార్యక్ర మంలో సుమారు 2 వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్ర మంలో ఖమ్మం నుంచి పాల్గొన్న కరాటే వేణు తన ప్రతిభను చాటుకుని రికార్డులో భాగస్వామిగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, కరాటే వంటి క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఖమ్మం జిల్లాకు గర్వకారణమని అన్నారు. వేణు సాధించిన రికార్డు యువతకు స్ఫూర్తిదాయ కమని, క్రీడల పట్ల యువతలో ఆసక్తిని పెంపొందిస్తూ మరింత మంది క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్య త్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ బాయ్, చల్లా రామకృష్ణారెడ్డి, దుర్గాబాయి, వట్టికొండ శ్రీనివాసరెడ్డి, మందడపు నాగేశ్వర రావు, మొగిలిచర్ల సైదులు, కొప్పెర ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి నుంచే ఉద్భవించి... గంగలో లీనమైన గణపతి

- రక్షకబట నిలయం మట్టి వినాయక నిమజ్జనోత్సవం..
- చేవెళ్ల ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి...



**చేవెళ్ళ, రాజముద్ర న్యూస్:** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో వినాయక నిమజ్జోత్సవ వేడుకలు ఘనంగా పండుగ వాతావరణంలో జరిగాయి. చేవెళ్ల ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శిషు మందిర్ విద్యార్థులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలు, కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. 11 రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న మట్టి గణనాథుడిని పర్యావరణహితంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పుష్కరిణిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి లడ్డు వేలం పాటలో డి ఐ ఇన్స్పెక్టర్ సమరం రెడ్డి రూ. 5,000 కు లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

**మట్టి గణపతిని పూజిద్దాం, పర్యావరణాన్ని కాపుడుదాం: చేవెళ్ల సిఐ నరేందర్ రెడ్డి**

పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించే మట్టి గణపతి నిమజ్జనం ప్రాముఖ్యత దాని వల్ల కలిగే లాభాలపై సమగ్ర కథనం, మట్టి గణపతుల ప్రాముఖ్యత పర్యావరణ పరిరక్షణకు మార్గం గణేష్ చతుర్థి వేడుకల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల కంటే మట్టి విగ్రహాలను పూజించడం, నిమజ్జనం చేయడం పర్యావరణానికి, సమాజానికి ఎంతో శ్రేయస్కరమని సిఐ నరేందర్ రెడ్డి అన్నారు. చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మట్టి విగ్రహాన్ని పూజించి, పుష్కరిణిలో నిమజ్జనం చేయడం ద్వారా సమాజానికి గొప్ప పర్యావరణ సందేశం అందజేశారు. మట్టి విగ్రహాలు నీటిలో చేరిన కొద్ది నిమిషాల్లోనే కరిగిపోతాయి. నీటి రంగు మారకుండా, ఘన వ్యర్థాలు పేరుకుపోకుండా సహజ స్థితిలోనే ఉంటుంది. నీటి కాలుష్యం విగ్రహాలు నీటిలో కరగడానికి నెలల సమయం పడుతుంది. ఇవి చెరువులు, నదులు, పుష్కరిణులను కలుషితం చేస్తాయి. మట్టి విగ్రహాల వల్ల నీటి నాణ్యత దెబ్బతినదు.

**రసాయనాల రహితం...**

పిఓపి విగ్రహాలకు వేసే రసాయనిక రంగులలో సీసం (లీడ్ ), కాడ్మియం (Cadmium), ఆర్సెనిక్ వంటి విషపూరిత మూలకాలు ఉంటాయి. ఇవి నీటిలో కలవడం వల్ల చేపలు, ఇతర జలచరాలు మరణిస్తాయి.మట్టి గణపతులకు పసుపు, కుంకుమ లేదా సహజసిద్ధమైన మట్టి రంగులను వాడటం వల్ల నీటిలోని ప్రాణులకు ఎటువంటి ప్రమాదం ఉండదు. వినాయక నిమజ్జనం తర్వాత ఏర్పడే మట్టిని నారు మొక్కలకు, కుండీలకు లేదా వ్యవసాయానికి ఎరువుగా కూడా ఉపయోగించవచ్చు. ఆ నీళ్లను తాగినా లేదా ఆ నీటి ద్వారా పండించిన పంటలను, చేపలను తీసుకున్నా మానవులలో చర్మ వ్యాధులు, క్యాన్సర్, నరాల బలహీనత వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మట్టి విగ్రహాల వినియోగం వల్ల ఈ ప్రమాదాలు తప్పుతాయి. ఈ కార్యక్రమంలోని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సతీష్, ఎస్ఐలు కోటేశ్వరరావు, శిరీష, రవీందర్ నాయక్, వెంకటేష్, పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు...

# డిజిటల్ క్రాప్ సర్వే పరిశీలన



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** ఇస్సన్నపల్లి గ్రామంలో క్షేత్ర స్థాయిలో సర్వేయర్లు నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను ఏఈఓ రాకేష్ , సర్పంచ్ దోకి లచ్చయ్య , ఉప సర్పంచ్ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్లకు రైతులకు పలు కీలక సూచనలు చేయడం జరిగింది.సర్వే నంబర్ల వారీగా పంట వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా అత్యంత కచ్చితంగా నమోదు చేయాలి. సర్వేయర్లు నమోదు చేసే ఈ వివరాలనే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు ప్రామాణికంగా తీసుకుంటారు కాబట్టి, ఎక్కడా తప్పులు జరగకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలి. రైతులకు సూచనలు: డిజిటల్ క్రాప్ బుకింగ్ ఆన్‌లైన్‌లోనిర్వహించడానికి రెవెన్యూ గ్రామానికి ఒక సర్వేయర్‌ను ప్రత్యేకంగా నియమించడం జరిగింది. రైతులు తమ గ్రామ సర్వేయర్‌కు అందుబాటులో ఉండి, తమ సర్వే నంబర్ల వారీగా సాగు చేస్తున్న పంట వివరాలను పంట రకాన్ని సరిగ్గానమోదుచేసుకోవాలని సూచడమైనది. అనంతరం రైతు గుర్తింపు కార్డులు చేశారుకార్యక్రమంలో ఏవో భాను శ్రీ , కార్యదర్శి, జిపిఓ,సర్వేయర్ చింతల రవీందర్, రైతులు దోమకొండ బైరయ్య, శంకర్, రాజు, శేఖర్, నరేష్ , భూమయ్య,బాలయ్య,సంజీవ్ రైతులు పాల్గొన్నారు.



# డీజే పర్మిషన్ కావాలని ట్యాంక్ ఎక్కిన యువకుడు

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామంలో వినాయక చవితి నిమజ్జనోత్సవ కార్యక్రమంలో భాగంగా డీజే పర్మిషన్ కావాలని అందులో సీఎం రేవంత్ రెడ్డి పాట కావాలని లేదంటే వాటర్ ట్యాంక్ నుంచి కిందకు దూకుతా అని కురుమ మహేష్ అనే స్థానిక వ్యక్తి వాటర్ ట్యాంక్ పైకి ఎక్కడం జరిగింది పోసానిపేట గ్రామంలో రామారెడ్డి ఎస్సై టీ మురళి ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్ హరీష్ రెడ్డి మహేష్ సంతోష్ కానిస్టేబుల్స్ వాటర్ ట్యాంకు పైకి ఎక్కిన,కురుమ మహేష్ ను నచ్చజెప్పి కిందికి దిగమని ప్రయత్నం చేస్తూ కానిస్టేబుల్స్ వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి యువకున్ని మెల్లగా కిందికి దింపారు, పోలీసు వారు చేసిన కృషికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# వానాకాలం మరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత




**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ :** 2026-27 వానకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు కొనుగోలు కేంద్రాలలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ పవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు, కొనుగోలు కేంద్రాలలో ఏర్పాట్లపై వ్యవసాయ విస్తరణ అధికారులు, సహకార శాఖ, ఐ. కె. పి. సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం సీజన్ లో 23 వేల 900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, అక్టోబర్ 1 తేదీన జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు, త్రాగునీరు, నీడ, వెలుతురు ఉండేలా, కొనుగోలు కేంద్రాలను ఎత్తైన చదును ప్రదేశాలలో, రహదారికి దగ్గరగా వాహనాలు వెళ్లేలా గుర్తించాలని తెలిపారు.. సరిపడా గోనె సంచులు, ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు, డ్రయర్లు ఉండేలా, ప్రతి కొనుగోలు కేంద్రంలో 2 ఎలక్ట్రానిక్ టూ కం యంత్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా హమాలీలను అందుబాటులో ఉంచాలని, 17 శాతం లోపు తేమ ఉండేలా, తాలు, దుమ్ము లేకుండా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలని, క్రమ పద్ధతిలో ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. టూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైతు మిల్లులకు తరలించాలని, వరి ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములను సిద్ధం చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో వసతులు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, ప్యాడి క్లీనర్లు, డ్రయర్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, మద్దతు ధర, సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ వంటి వివరాలు రైతులకు తెలిసే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసి కొనుగోలు చేపట్టాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా పౌర సరఫరాల అధికారి వాజీద్, జిల్లా సహకార అధికారి, ఐ కె పి ఎ.పి.ఎం.లు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు వ్యవసాయ విస్తరణ అధికారులకు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్ అభివృద్ధి పనులపై కలెక్టర్ రాజర్షిషా సమీక్ష



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** రిమ్స్ లో అత్యవసర మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. రిమ్స్ ఆసుపత్రిలో నూతన ప్రతిపాదనలు, మౌళిక వసతుల కల్పనపై శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రిలో చేపట్టాల్సిన అత్యవసర రిపేర్లు, తలుపులు, కిటికీలు, టాయిలెట్లు, ఆక్సిజన్ పైప్లైన్లు, జనరేటర్లు, లిఫ్ట్, రోడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులన్నీ ఎలాంటి జాప్యం లేకుండా అత్యవసర ప్రాతిపదికన వెంటనే చేపట్టాలని ఆదేశించారు. మంజూరైన రూ.11.10 కోట్ల అత్యవసర నిధులతో విద్యుద్దీకరణ, రోడ్లు, భవన సముదాయాలు, మౌళిక వసతులు, శానిటేషన్ పనులకు సంబంధించిన మరమ్మతు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని, చేపట్టిన ప్రతి పనిలోనూ ఖచ్చితంగా వారంటీ, ఏఎంసీ ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. క్రిటికల్ కేర్ బ్లాక్ పనులను కేవలం 15 రోజుల్లో పూర్తి చేసేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, టెండర విషయంలో జాప్యం జరగకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. అవుట్‌పేషెంట్, ప్రెగ్నెంట్ బ్లాక్ మధ్య రోగుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పనుల కేటాయింపులో ఎలాంటి సిఫార్సులు, పక్షపాత ధోరణులు ఉండకూడదని, ప్రతి పనిలోనూ పూర్తి పారదర్శకత పాటించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, పంచాయతీ రాజ్ ఈఈ శివరామ్, తదితర ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక




**ఆత్మకూర్ (ఎం) రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం). మండలం లో ని టీ.రేపాక గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఏనూతూల వంశీకృష్ణ (కిట్టు), ఉపాధ్యక్షుడిగా చింతల అఖిల్, ప్రధాన కార్యదర్శిగా బండ రవి, కార్యదర్శిగా రాపోలు రవి, సలహాదారుడిగా దేవరకొండ మదనచారిని ఎన్నుకున్నారు. గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, యువత అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామాభివృద్ధిలో తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**ఆత్మకూర్ (ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం) మండల కేంద్రానికి చెందిన కొల్లు నర్సింహారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో కాంగ్రెస్ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జన్నాయికోడె నగేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, దొంతరబోయిన భాస్కర్, ఎద్దు వెంకన్న, చెరుకు శ్రీనివాస్, నోముల వెంకట్‌రెడ్డి, పోతగాని మల్లేష్, ఉగ్గె నరేష్, నోముల యాదగిరి, ఎలిమినేటి మురళి, తొండల అనిల్‌కుమార్ గౌడ్, రాచమల్ల ప్రసాద్, బొబ్బలి అంజిరెడ్డి, పాశం అనంతరెడ్డి, తవిటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహణ



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలోని పాఠశాలలో డాక్టర్ అక్షయ్ కుమార్ దివ్యాంగుల ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొని పర్యవేక్షించి తల్లిదండ్రులకు తగు సూచనలు చేశారు వారానికి రెండు రోజుల నిర్వహించే క్యాంపులో శారీరక వైకల్యం గల విద్యార్థులు క్రమం తప్పకుండా వచ్చి డాక్టర్ గారి ద్వారా చికిత్స పొందినట్లయితే వారి వైకల్యాన్ని కొంత మేరకు నివారించి వారి జీవన నైపుణ్యాలను పెంపొందించవచ్చు అని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రమేష్, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ మహమూద్ పాల్గొన్నారు.

## SGFI రాష్ట్రస్థాయి బరిలో పల్లెర్ల విద్యార్థులు



**ఆత్మకూర్ (ఎం) రాజముద్ర న్యూస్:** SGFI ఉమ్మడి నల్గొండ జిల్లా ఆధ్వర్యంలో చెరువన్నారం జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన 14, 17 సంవత్సరాల బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో పల్లెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి తండా రాజేష్ 14 సంవత్సరాల బాలుర విభాగంలో, ప్రణతి 14 సంవత్సరాల బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వెంకటనరసయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచడం పాఠశాలకు గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు డాక్టర్ జెట్ట రవీందర్ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, నిరంతర సాధన ఫలితంగానే రాష్ట్రస్థాయి ఎంపిక సాధ్యమైందన్నారు. రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రదర్శన కనబరచాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను AAPC చైర్మన్ సుమిత్ర, గ్రామ సర్పంచ్ తండ మంజుల, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



# వయసుపై వస్తున్న రూమర్స్‌కు వైష్ణవి చైతన్య చెక్

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :** టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ వైష్ణవి చైతన్య తన వయసుపై వస్తున్న రూమర్స్‌కు చెక్ పెట్టారు. యూట్యూబర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె షార్ట్ ఫిలింస్, వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం సినిమాల్లోకి అడుగుపెట్టి 'అల వైకుంఠపురములో', 'రంగ్ దే', 'టక్ జగదీష్', 'వరుడు కావలెను' వంటి చిత్రాల్లో సహాయక పాత్రల్లో నటించారు. 'బేబీ' సినిమాతో హీరోయిన్‌గా అరంగేట్రం చేసిన వైష్ణవి.. ఆ చిత్రంతో ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'లవ్ మీ', 'జాక్' చిత్రాల్లో కథానాయికగా నటించారు. ఇటీవల ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఎపిక్' సినిమాలో కనిపించారు. సెప్టెంబరు 11న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన అందుకుంది. 'ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వైష్ణవిని యాంకర్ ఆమె వయసుపై ప్రశ్నించారు. వికీపీడియాలో తన వయసు 32 ఏళ్లుగా ఉందని, అయినప్పటికీ 25 ఏళ్ల అమ్మాయిలా కనిపిస్తున్నారని.. అందుకు కారణం ఏమిటని అడిగారు. దీనికి స్పందించిన వైష్ణవి.. వికీపీడియాలో తన వయసుతో పాటు పుట్టిన ప్రదేశానికి సంబంధించిన వివరాలు కూడా తప్పుగా ఉన్నాయని స్పష్టం చేశారు. తన వయసు 25 ఏళ్లు మాత్రమేనని వైష్ణవి తెలిపారు. ఇదే ఇంటర్వ్యూలో యాంకర్ ఆధార్ కార్డు ఫొటో చూపించగలరా అని అడగ్గా.. వైష్ణవి తన మొబైల్‌లో ఉన్న ఆధార్ చిత్రాన్ని చూపించినట్లు సమాచారం. అందులో ఆమె పుట్టిన సంవత్సరం 2001గా ఉందని తెలుస్తోంది. దీంతో వైష్ణవి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# కాయదుకు వరుస పరాజయాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :** కన్నడ చిత్రం 'ముగిల్‌పేట'తో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన కాయదు లోహార్‌కు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకునే అవకాశం ఉన్న ఈ భామకు మంచి అవకాశాలు వస్తున్నప్పటికీ.. అవి మాత్రం ఆశించిన విజయాలను అందించలేకపోతున్నాయి. ముఖ్యంగా తెలుగు చిత్రసీమలో ఆమె నటించిన సినిమాలు వరుసగా నిరాశపరచడంతో కెరీర్‌పై ప్రభావం పడుతోంది. శ్రీవిష్ణు సరసన నటించిన 'అల్లూరి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కాయదు.. ఆ తర్వాత 'ఫంకీ'లోనూ కనిపించింది. అయితే ఈ రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. దీంతో వరుసగా సినిమాలు చేస్తున్నా.. ఖాతాలో చెప్పుకోదగ్గ కమర్షియల్ హిట్ లేకపోవడం ఆమెకు ప్రతికూలంగా మారింది.

### 'ది ప్యారడైజ్'తోనూ నిరాశే..

నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది ప్యారడైజ్'లో కాయదుకు అవకాశం లభించింది. అయితే ఈ సినిమాలో ఆమె పోషించిన పాత్రపై ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. తండ్రి చేసిన అప్పులను తీర్చే క్రమంలో బి-గ్రేడ్ చిత్రాల్లో నటించే యువతిగా ఆమె పాత్రను తీర్చిదిద్దారు. ఈ పాత్ర ఎంపికపై కొందరు ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

### కథల ఎంపికపై దృష్టి అవసరం

గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎంచుకునే అవకాశం కాయదు లోహార్‌కు ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే కథ, పాత్రల ఎంపిక విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంచి అవకాశాలను విజయాలుగా మలుచుకుని, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం కాయదు కెరీర్‌లో కీలకంగా మారనుంది.



# 'సిగ్మా'లో మంచి ఎమోషనల్ క్యారెక్టర్: ఫరియా

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :** సందీప్ కిషన్ హీరోగా జేసన్ సంజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సిగ్మా' చిత్రంలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఫరియా మీడియాతో మాట్లాడారు. 'సిగ్మా'లో తాను రేడియో జాకీ పాత్రలో కనిపిస్తానని ఫరియా తెలిపారు. తన పాత్రలో అన్ని రకాల భావోద్వేగాలను చూపించే అవకాశం లభించిందని చెప్పారు. యాక్షన్, అడ్వెంచర్, కామెడీ అంశాలతో రూపొందిన ఈ చిత్రాన్ని కుటుంబంతో కలిసి హాయిగా చూడొచ్చని పేర్కొన్నారు. సందీప్ కిషన్‌తో కలిసి సినిమా చేయాలని చాలా కాలంగా అనుకుంటున్నామని, చివరకు 'సిగ్మా'తో ఆ అవకాశం వచ్చిందని ఫరియా వెల్లడించారు. దర్శకుడు జేసన్ సంజయ్ జూమ్ కాల్‌లో కథ చెప్పారని, కథ విన్న తర్వాత ఆయన వయసు అడిగితే 24 ఏళ్లని చెప్పారని గుర్తుచేసుకున్నారు. తొలి సినిమా అయినప్పటికీ జేసన్ ఎంతో స్పష్టత, విజన్‌తో చిత్రాన్ని తెరకెక్కించారని ఫరియా ప్రశంసించారు. సూపర్‌స్టార్ విజయ్ కుమారుడనే భావన ఆయనలో ఏమాత్రం కనిపించదని, చాలా వినయంగా, స్నేహపూర్వకంగా ఉంటారని అన్నారు. 'సిగ్మా' లాంటి మంచి ప్రాజెక్ట్‌తో తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందని, తమన్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఫరియా పేర్కొన్నారు.



# 'లవ్ అండ్ వార్'లో ఆలియా భట్ ఫస్ట్ లుక్

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :** బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'లవ్ అండ్ వార్' నుంచి వరుస అప్‌డేట్స్ వస్తున్నాయి. ఇప్పటికే రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన చిత్రబృందం.. తాజాగా ఆలియా భట్ ఫస్ట్ లుక్‌ను కూడా అభిమానులతో పంచుకుంది. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'ఆగ్ భీ, దిల్ కీ జాన్ భీ!' అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన ఆలియా భట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రేమ, భావోద్వేగాలతో పాటు యాక్షన్ అంశాలను మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్‌తో పాటు విక్కీ కౌశల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. స్టార్ హీరోహీరోయిన్ల కాంబినేషన్‌కు భన్సాలీ దర్శకత్వం తోడవడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే 'లవ్ అండ్ వార్' 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com